క్లుప్తంగా

ఎంపీటీసీకి పరామర్శ



ఎంపీటీసీ పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎస్.రాయవరం : ఎండ తీవ్రతతో అస్వస్థతకు గురైన కొరుప్రోలు ఎంపీటీసీ కేసుబోయిన వెంకటలక్ష్మిని వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం పరామర్శించారు. రెండు రోజులుగా ఆమె ఎండ తీవ్రతకు అస్వస్థతకు గురయ్యారు. వైద్య పరీక్షలు అనంతరం ఆమె ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలిసిన నాయకులు మంగళవారం పరామర్శించారు. త్వరగా కోలుకుని ఎన్నికల ముందు ప్రచారానికి రావాలని ఆకాంక్షించారు. ఎంపీటీసీని పరామర్శించిన వారిలో పీఏసీఎస్ చైర్‌పర్సన్ చేకూరి శ్రీరామచంద్రరాజు, నాయకులు కోరెడ్డి సుబ్బారావు, పినపాత్రుని శ్రీనివాసరావు, పోలవరపు నాగేశ్వరరావు ఉన్నారు.

నేడు పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ ప్రచారం

కోటవురట్ల : ఎన్నికల వేళ పల్లెలు ప్రచారాలతో హోరెత్తుతున్నాయి. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఓటర్లను కలుసుకుని తనదైన శైలిలో ఫ్యాను గుర్తుకు ఓటెయ్యాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటలకు ఆక్సాహేబుపేట, చినబొడ్డేపల్లిలో 10 గంటలకు ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. అనంతరం పాములవాకలో లంచ్ చేసి తిరిగి సాయంత్రం 4 గంటలకు నీలిగుంటలోను, 6 గంటలకు పాములవాకలోను ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు తెలిపారు.

స్వతంత్ర అభ్యర్థి నామినేషన్

నక్కపల్లి : పాయకరావుపేట అసెంబ్లీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా దేవవరం గ్రామానికి చెందిన బూర్తి ఏసియ్య మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. ఒక సెట్ నామినేషన్ పత్రాలను ఆయన ఆర్‌వో కె. గీతాంజలికి అందజేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఏసియ్య పాయకరావుపేట నుంచి పోటీ చేసేందుకు పార్టీ టికెట్ ఆశించారు. కానీ టికెట్ దక్కకపోవడంతో ఏసియ్య ఇండిపెండెంట్‌గా అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఇప్పటి వరకు దాఖలైన నామినేషన్‌ల సంఖ్య 7కు చేరుకుందని ఆర్‌వో గీతాంజలి తెలిపారు. వైఎస్సార్ సీపీ నుంచి 3 సెట్లు, టీడీపీ నుంచి 2 సెట్లు, జై భారత్ నేషనల్ పార్టీ తరపున ఒకటి, ఇండిపెండెంట్‌ల నుంచి ఒకటి నామినేషన్‌లు దాఖలయ్యాయని ఆమె తెలిపారు.

ముగ్గురు గ్రామ వలంటీర్లు రాజీనామా



రాజీనామా పత్రాలను ఎంపీడీవోకు అందిస్తున్న వలంటీర్లు

పాయకరావుపేట : మండలంలో గల పాల్తేరు గ్రామానికి చెందిన ముగ్గురు గ్రామ వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. ఎన్నికల సంఘం వలంటీర్లు విధులకు ఆటంకం కల్పించడం, ఆంక్షలు విధించడం కారణంగా తాము రాజీనామా చేసినట్టు తెలిపారు. వీరు రాజీనామా పత్రాలను మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కె.స్వప్నకు అందజేశారు.

ఏకాగ్రతతో చదువుకుని పోటీ పరీక్షల్లో రాణించాలి



విద్యార్థులకు గుడ్డ బ్యాగ్‌లు అందజేస్తున్న దృశ్యం

మునగపాక : విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకొని పోటీ పరీక్షల్లో రాణించాలని అనకాపల్లి షిరిడీ సాయి లా కళాశాల కరస్పాండెంట్ పెంటకోట వెంకటరావు కోరారు. స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాలిసెట్ శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా నిర్వహించిన పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు గుడ్డ బ్యాగ్‌లను బహుమతులుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్ విద్యాభివృద్ధికి అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణమూర్తి, సతీష్‌కుమార్, మాడెం జోగారావు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

మత్స్యకారులను ఆదుకున్నది జగనన్నే



గజపతినగరంలో ప్రచారం నిర్వహిస్తున్న కంబాల జోగులు, చిక్కాల రామారావు



ఓటర్లకు ఫ్యాన్ గుర్తు, అభ్యర్థుల బ్రోచర్లను అందిస్తున్న కంబాల జోగులు

- ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు
- రాజవరం, గజపతినగరంలో ఎన్నికల ప్రచారం

పాయకరావుపేట : రాష్ట్రంలో ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు అన్నారు. ఆయన మంగళవారం మండలంలో గల రాజవరం, గజపతినగరం గ్రామాల్లో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావుతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యర్థి కంబాల జోగులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. మత్స్యకారులకు మత్స్యకార భరోసా పథకం ద్వారా వేట నిషేధ సమయంలో వేరుగా మత్స్యకారుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేస్తున్నారన్నారు. మత్స్యకారులు ప్రమాదవశాత్తూ వేట సమయంలో నష్టం వాటిల్లితే బీమా ద్వారా రూ.10 లక్షలు అందిస్తున్నారన్నారు. మత్స్యకారులకు వేటకు ఉపయోగపడేందుకు బోట్లకు డీజిల్ రాయితీ కల్పిస్తున్నారన్నారు. జెట్టీల నిర్మాణం, పోర్టులు నిర్మాణం, తీర ప్రాంతంలో ప్లాట్‌ఫారాలు నిర్మాణాలకు కృషి చేస్తున్నారన్నారు. ఈబీసీ నేస్తం ద్వారా మత్స్యకారులకు కూడా సంక్షేమ పథకం ద్వారా నగదు జమ అవుతోందన్నారు. సంక్షేమ పథకాలు యథా ప్రకారం కొనసాగాలంటే మరలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డినే గెలిపించుకోవాలన్నారు. మే 13 న జరగబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా తననూ, ఎంపీ అభ్యర్థిగా బూడి ముత్యాలనాయుడుకు ఫ్యాన్ గుర్తు పై ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఫ్యాన్ గుర్తు, అభ్యర్థుల ఫోటోలు వున్న బ్రోచర్లను ఓటర్లకు పంచారు. రాజవరం, గజపతినగరం గ్రామాల్లో అభ్యర్థి కంబాల జోగులకు అడుగడుగునా హారతులతో మహిళలు స్వాగతం పలికారు. ప్రచారంలో జిల్లా ప్రచార విభాగం అధ్యక్షులు దగ్గుపల్లి సాయిబాబా, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ చోడిపల్లి శ్రీను, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, పార్టీ మాజీ మండల అధ్యక్షులు ధనిశెట్టి బాబూరావు, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి యజ్జల అన్నవరం, రాజవరం సర్పంచ్ గోసల అమ్మాజీ, ఎంపీటీసీ గోసల మరిణమ్మ, సర్పంచ్‌లు కోడ కోటేశ్వరరావు, మేడిశెట్టి రామగోవిందు, గెడ్డమూరి శ్రీనివాసరావు, చేపల నాగమణి తాతాజీ, పిర్ల వెంకటరమణ, కొంతం నరేష్, పాలపర్తి సతీష్, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కాధా రామకృష్ణ, మండల యూత్ అధ్యక్షుడు గుజ్జు గోవిందరెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బోడపాటి గోవిందు, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు దేవవరపు వెంకటేశ్వరరావు, ఏఎంసీ డైరెక్టర్ పెనుమత్స నాగేశ్వరరావు, ఎంఎల్‌ఓ కాకాడ కృష్ణ, పాయకరావుపేట ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, పార్టీ సీనియర్ నాయకులు పల్లేల కృష్ణార్జునరావు, కోనే పుత్రరావు, పల్లేల వెంకట్, చోడిపల్లి అన్నవరం పాల్గొన్నారు.

టెన్త్ టాపర్లకు అభినందన



మండల టాపర్లుగా నిలిచిన విద్యార్థులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు



కోటవురట్ల జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో టాపర్ రిషితను అభినందిస్తున్న డిప్యూటీ డీఈవో అప్పారావు

ఎస్.రాయవరం : పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులు ఉన్నత చదువుల్లో కూడా మరిన్ని ర్యాంకులు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని దార్లపూడి ప్రధానోపాధ్యాయులు ఎం. రమణశ్రీ అన్నారు. సోమవారం విడుదలైన పది పరీక్షల్లో దార్లపూడి పాఠశాల విద్యార్థి శివశంకర్‌వరప్రసాద్ 579 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలవడంతో మంగళవారం పాఠశాలలో దుస్సాలువాతో సత్కరించి అభినందించారు. ఇదే పాఠశాల నుంచి మరో విద్యార్థి వెంకట పవన్‌సాయి 574 మార్కులు సాధించి మండలంలో ద్వితీయ స్థానంలో నిలిచాడు. ఆ విద్యార్థిని కూడా సత్కరించారు. తదుపరి చదువుల్లో మరిన్ని మంచి ఫలితాలు సాధించి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

కోటవురట్ల : సర్కారు బడిలో చదివి అత్యుత్తమ మార్కులతో మండల టాపర్‌గా నిలిచిన యల్లపు రిషితకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోవని నిరూపించిన రిషితను పలువురు అభినందనలతో ముంచెత్తుతున్నారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు చెందిన యల్లపు రిషిత పదో తరగతి పరీక్షా ఫలితాలలో 572 మార్కులు సాధించి మండలంలో టాపర్‌గా నిలిచింది. ఇదే పాఠశాలకు చెందిన ఉప్పు రజితకు 566 మార్కులు రావడంతో ఇరువురిని డిప్యూటీ డీఈవో పి.అప్పారావు మంగళవారం అభినందించారు. విద్యార్థులు రిషిత, రజితలను స్ఫూర్తిగా తీసుకుని మంచి ఫలితాలు సాధించాలని కోరారు. హెచ్ఎం ఏసుదాసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో చక్రస్నానం



చక్రస్నానం కార్యక్రమానికి హాజరైన భక్తులు



చక్రస్నానంలో దంపతులు

మునగపాక : మునగపాకలో మంగళవారం చక్రస్నానం కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా మునగపాక పంచాయతీ వీధిలోని రామాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన చక్రస్నానం కార్యక్రమంలో మునగపాక పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో కోలాటం పోటీలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

అక్రమ మద్యం పట్టివేత



జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం పట్టుకున్న మద్యం బాటిళ్లు

నక్కపల్లి : జాతీయ రహదారిపై ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డు సమీపంలో రాత్రి కోనవానిపాలెం వద్ద రూ.17వేలు విలువ కలిగిన అక్రమ మద్యాన్ని జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం మంగళవారం రాత్రి పట్టుకున్నారు. ఈ బృందంలో ఉన్న జీఎస్టీ అధికారి ఎస్.వి. ప్రసాదరావు, ఎక్సయిజ్ సీఐ సూర్యకుమారి, ఎస్ఐ నాగకార్తీక్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కోనవానిపాలెం జంక్షన్‌లో వాయుపుత్ర పాన్‌షాపు వద్ద అట్టపెట్టెల్లో ఉంచి వాటిపై గోనె సంచులు కప్పి తీసుకు వస్తున్న వ్యక్తిని అనుమానించి పట్టుకోవడం జరిగిందన్నారు. ఈ పెట్టెల్లో 98 అక్రమ మద్యం బాటిళ్లు కనుగొనడం జరిగిందన్నారు. వీటి విలువ రూ.17వేలుగా పేర్కొన్నారు. ఈ బాటిళ్లను షాపుల వద్ద కొనుగోలు చేసి లాభాలకు తన పాన్‌షాపులో విక్రయించేందుకు తీసుకు రావడం జరిగిందని నిందితుడు తెలిపాడన్నారు. బాటిళ్లను స్వాధీనం చేసుకుని, నిందితుడు ఇందుపూరి వీరబాబును అదుపులోకి తీసుకున్నామన్నారు. బాటిళ్లతో నిందితుడిని ఎస్.రాయవరం పోలీస్‌స్టేషన్‌కు అప్పగించి కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ బృందంలో మహేష్, రమణ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యలమంచిలి రూరల్: స్థానిక 33/11కేవీ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో రాంబిలి 11కేవీ ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా బుధవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సోమలింగపాలెం, కట్టుపాలెం, రామారాయుడుపాలెం, యలమంచిలి, ఎర్రవరం, కొత్తపాలెం వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు అనకాపల్లి ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్స్ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. విద్యుత్ లైన్లపై వాలిన చెట్ల కొమ్మలు తొలగిస్తామని, ఈ పనుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆయన మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులంతా ఈ విషయాన్ని గమనించి తమ శాఖను సహకరించాలన్నారు.

సెలవుల్లో తరగతులు నిర్వహించవద్దు

రాంబిల్లి : వేసవి సెలవుల్లో పాఠశాలల్లో తరగతులు నిర్వహించవద్దని ఎంఈవో ఎం.సూర్యారావు పేర్కొన్నారు. పాఠశాలలకు బుధవారం నుంచి వేసవి సెలవులు ప్రకటించడం జరిగిందన్నారు. జూన్ 12న పాఠశాలలు తెరుచుకోవడం జరుగుతుందన్నారు. దీనిని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాల ల యాజమాన్యాలు తప్పనిసరిగా పాటించాలన్నా రు. లేనియెడల నిబంధనల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

30 తేదీ వరకు ఆస్తి పన్నుపై వడ్డీ రాయితీ

యలమంచిలి రూరల్: ఈ నెల 30 లోగా ముందస్తు గా ఆస్తి పన్ను చెల్లించినవారికి 5 శాతం రాయితీ ఇస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ కె.ఎ.కొండలరావు తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నులో మినహాయింపు ఇస్తూ మున్సిపల్ పరిపాలన శాఖ కమిషనర్ ఆదేశాలిచ్చారని ఆయన చెప్పారు. గతంలో బకాయిలు పూర్తిగా చెల్లించడంతో పాటు ఈ ఏడాది పన్ను కూడా చెల్లిస్తే వారికి 5 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా ఇందేశమ్మతల్లి పండగ



ఇందేశమ్మతల్లిని దర్శించుకున్న ఎంఎస్ఎంఈ చైర్మన్ సూర్యనారాయణరాజు

కోటవురట్ల : పందూరు గ్రామంలో ఇందేశమ్మతల్లి పండగను మంగళవారం ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా వరాహనది తీరాన వేంచేసియున్న ఇందేశమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమీప గ్రామాల నుంచి వచ్చిన భక్తులు తల్లిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఎంఎస్ఎంఈ చైర్మన్ డి.వి.సూర్యనారాయణరాజు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పండగ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. లోగిళ్లలో సందడి కనిపించింది. మాజీ సర్పంచ్ టి.నారాయణరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు దొడ్డి రమేష్ పాల్గొన్నారు.

వైభవంగా హనుమాన్ జయంతి

కోటవురట్ల : మండలంలో హనుమాన్ జయంతిని మంగళవారం భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్వామికి సింధూర, తమలపాకులతో పూజలు, అభిషేకాలు చేశారు. కైలాస పట్నం, కోటవురట్ల, పాములవాక, సుంకపూరు, యండపల్లి తదితర గ్రామాలలో ఆంజనేయస్వామి ఆలయాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా పారిపల్లెమ్మ అమ్మవారి పండగ



పారిపల్లెమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక : వాడ్రాపల్లి పారిపల్లెమ్మ అమ్మవారి నెల పండగ మంగళవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. అనకాపల్లికి చెందిన డాక్టర్ బెనర్జీ దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు,మాజీ సర్పంచ్ మళ్ల రవి, సచివాలయ కన్వీనర్ పెతకంశెట్టి రామజోగినాయుడు, ఉత్సవకమిటీ చైర్మన్ మళ్ల కన్నుంనాయుడు తదితరులు అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.

సీఎం జగన్ పాలనలోనే అందరి సంక్షేమం



తిమ్మరాజుపేటలో ఇంటింటా ప్రచారం చేస్తున్న బీసీ సెల్ మండల అధ్యక్షుడు జగన్



గణపర్తిలో ఇంటింటా ప్రచారం చేస్తున్న సచివాలయ కన్వీనర్ అప్పలనాయుడు

మునగపాక : అన్ని వర్గాల ప్రజలకు రానున్న రోజుల్లో మరింత సంక్షేమం అందాలంటే జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలపరచాలని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు కాండ్రేగుల జగన్ కోరారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బూడి ముత్యాలనాయుడు, యు.వి.రమణమూర్తిరాజు విజయం కోరుతూ తిమ్మరాజుపేటలో ఆయన పార్టీ శ్రేణులతో కలిసి సోమవారం రాత్రి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. గణపర్తిలో సచివాలయ కన్వీనర్ చదరం అప్పలనాయుడు ఇంటింటా ప్రచారం ముమ్మరం చేశారు. ప్రతి ఇంటికీ వెళ్లి జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో జరిగిన మేలును వివరిస్తూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలని కోరారు.

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి, సంక్షేమం

- ఎమ్మెల్యే రమణమూర్తిరాజు
- ఏటికొప్పాకలో ఎన్నికల ప్రచారం



ఏటికొప్పాకలో ఉపాధి కూలీలను ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న ఎమ్మెల్యే కన్నబాబు

యలమంచిలి : రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం మళ్లీ వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని యలమంచిలి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు) అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం యలమంచిలి మండలం ఏటికొప్పాక మేజర్ పంచాయతీలో ఉపాధిహామీ కార్మికులతో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను అనకాపల్లి వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బూడి ముత్యాలనాయుడును గెలిపించాలని కోరారు. గత 5 ఏళ్లలో రాష్ట్రంలో అన్నివిధాలుగా అభివృద్ధి జరిగిందంటే వైఎస్సార్‌సీపీ వల్లనే అని ప్రజలు గ్రహించాలని, ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు అందాయని, అలాగే విద్య, ఉద్యోగం, ఆరోగ్యం వ్యవసాయానికి ముఖ్యమంత్రి పెద్దపీట వేశారని అన్నారు. యలమంచిలి నియోజకవర్గాన్ని మూడు దఫాలుగా ఎమ్మెల్యేగా ఉంటూ తాను ఎంతో అభివృద్ధి చేయడం జరిగిందని తెలిపారు. ఉపాధిహామీ కార్మికులంతా వైఎస్సార్‌సీపీని ఆదరించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బోదెపు గోవింద్, యలమంచిలి మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు యర్రయ్యదొర, ఏటికొప్పాక వైఎస్సార్‌సీపీ నాయకులు జెడ్పీటీసీ భర్త సేనాపతి రాము, యలమంచిలి రూరల్ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

'పింఛను డబ్బులు ఇంటికి పంపిన జగన్‌బాబుకే మా మద్దతు'



కొరుప్రోలు బీసీ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎస్.రాయవరం : నాకు పింఛను డబ్బులు ఇంటికి పంపించిన జగన్‌బాబే మళ్లీ సీఎం కావాలి, ఫ్యాను గుర్తుకే మా ఓటు అని ఓ వృద్ధురాలు ప్రచారానికి వచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులకు చెప్పడంతో ఎన్నికల ప్రచారంలో మరింత జోష్ పెరిగింది. పాయకరావుపేట వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కంబాల జోగులకు మద్దతుగా కొరుప్రోలు గ్రామంలో పీఏసీఎస్ చైర్‌పర్సన్ చేకూరి శ్రీరామచంద్రరాజు మంగళవారం బీసీ కాలనీలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అవ్వా తాతలను ఆప్యాయంగా పలకరించి పింఛను ఇంటికి పంపకుండా ఆపించింది ఎవరని, మీరు మరళా ఎవరిని సీఎంగా చేసుకోవాలని కోరుకుంటున్నారని అడుగుతూ ప్రచారం చేశారు. మాకు ఇంటి వద్దకు ప్రభుత్వ సేవలు, కంటిముందు పరిపాలన అందించిన మా దేవుడు జగన్‌బాబు అంటూ ప్రతి ఇంటా జనం తమ అభిమానం వ్యక్తపరిచారు. మేమంతా ఫ్యాను గుర్తుకి ఓటు వేస్తామని ముక్తకంఠంతో చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పినపాత్రుని శ్రీనివాసరావు, పోలవరపు నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

గూడుపమ్మతల్లిని దర్శించుకున్న కంబాల



గూడెపమ్మతల్లిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

నక్కపల్లి : మండలంలో ప్రసిద్ధి గాంచిన రేబాక గూడుపమ్మ తల్లి పండగ మంగళవారం ఘనంగా జరిగింది. మెరక గ్రామాల ఆరాధ్యదైవంగా గూడుపమ్మతల్లిని కొలుస్తారు. ఈ ఆలయాన్ని ఇటీవలే లక్షలాదిరూపాయలతో పునఃనిర్మాణం చేపట్టారు. అమ్మవారిని మంగళవారం ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు, కాపుకార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు నర్సింహమూర్తి, సర్పంచ్ సాదిరెడ్డి శ్రీను ఎంపీటీసీ సభ్యుడు కాసు బాబు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : పల్లెల్లో అమ్మవారి జాతరులు గ్రామస్తుల్లో ఐక్యతను పెంచుతాయని పాయకరావుపేట సమన్వయకర్త వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. పెట్టుగోళ్లపల్లి గ్రామంలో మంగళవారం గూడెపమ్మ తల్లి జాతరను పురస్కరించుకుని ఎమ్మెల్యే కంబాల జోగులు, నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యేకు ఉత్సవ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎస్.రాయవరం, నక్కపల్లి మండలాల వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షులు గోవిందు, నరసింహమూర్తి, జిల్లా కమిటీ కార్యదర్శి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ గోవిందు, వరహాలరావు, ఎంపీటీసీ చొప్పా రాజు,సింహాద్రి పాల్గొన్నారు.

ఎండవేడిమితో సతమతం



నిర్మానుష్యంగా మునగపాక మెయిన్‌రోడ్డు



మునగపాకలో గొడుగులతో రాకపోకలు సాగిస్తున్న మహిళలు

మునగపాక: కొద్ది రోజులుగా వేసవి తాపం పెరిగిపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. వేడిగాలులు వీయడంతో ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలపై రాకపోకలు సాగించేవారు ఎండతీవ్రతను తట్టుకోలేక అవస్థలకు గురవుతున్నారు. దీంతో ఉదయం 10 గంటల లోపే పనులు ముగించుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. మునగపాక మెయిన్ రోడ్డు మంగళవారం ఉదయం 11గంటలకే నిర్మానుష్యంగా మారింది. మహిళలు గొడుగులు ధరించి రాకపోకలు సాగించారు.